04.01.2026
ఆదివారం
www.bestvoicenews.com
bestvoice
# బెస్ట్ వాయిస్
తెలుగు దినపత్రిక
సంపుటి:10 | సంచిక : 266 | వెల:రూ 1/- వరంగల్ ఎడిటర్: కె.మోహన్‌రావు పేజీలు 07



# మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ..

- పతన దిశగా అగ్రనాయకత్వం.?
- మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- PGLA చీఫ్ లొంగుబాటు సంచలనం
- కుదించిన కేంద్ర కమిటీ
- పతనం బాటలో ఉద్యమం

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపుగా భావించదగ్గ పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాటమే మార్గంగా పనిచేస్తున్న మావోయిస్టు పార్టీకి తెలంగాణలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సైనిక విభాగం అయిన పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ (PGLA) చీఫ్ బర్సె దేవా, మరో 48 మంది అనుచరులతో కలిసి తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ భారీ లొంగుబాటు మావోయిస్టు పార్టీ ఉనికినే ప్రశ్నార్థకంలో పడేసింది. ఒకప్పుడు 41 మంది సభ్యులతో అత్యంత బలంగా ఉన్న మావోయిస్టు కేంద్ర కమిటీ, వరుస ఎన్‌కౌంటర్లు , లొంగుబాట్ల కారణంగా ప్రస్తుతం కేవలం నలుగురు సభ్యులకు మాత్రమే పరిమితం కావడం ఆ పార్టీ పతన దిశకు సంకేతంగా కనిపిస్తోంది. బర్సె దేవా మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన వ్యూహకర్తగా పేరుపొందారు. ముఖ్యంగా అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత, పార్టీ సాయుధ బలగాల బాధ్యతలను భుజాన వేసుకున్న దేవా, గెరిల్లా యుద్ధ తంత్రాలను అమలు చేయడంలోనూ , పార్టీకి అత్యాధునిక ఆయుధాలను సరఫరా చేయడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు. ఆశ్చర్యకరంగా హిడ్మా , బర్సె దేవా ఇద్దరూ ఛత్తీస్‌గఢ్‌లోని ఒకే గ్రామానికి చెందిన వారు కావడం గమనార్హం. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసులు నిర్వహించిన పక్కా ఆపరేషన్ ఫలితంగానే ఈ లొంగుబాటు సాధ్యమైంది. నిన్న రాత్రి సరిహద్దు ప్రాంతం నుండి వీరిని సురక్షితంగా తరలించిన పోలీసులు, త్వరలోనే వీరికి అందే పునరావాస ప్యాకేజీల వివరాలను వెల్లడించనున్నారు. క్షేత్రస్థాయిలో పట్టున్న దేవా వంటి నాయకుడు దూరం కావడంతో మిగిలిన నలుగురు సభ్యులపై తీవ్ర ఒత్తిడి పడనుంది. బర్సె దేవా లొంగుబాటు కేవలం ఒక వ్యక్తి నిర్ణయం కాదు, అది ఒక సిద్ధాంత పోరాటంలో వస్తున్న మార్పుకు, మావోయిస్టు ఉద్యమ మనుగడ సంక్షోభానికి నిదర్శనంగా నిలుస్తోంది.



## ఇద్దరు పిల్లల నిబంధనకు చెక్..

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌ను సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ శనివారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా, గత కొన్ని దశాబ్దాలుగా అమలులో ఉన్న "ఇద్దరు పిల్లల నిబంధన"ను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అంటే, ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్న వ్యక్తులు కూడా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయడానికి చట్టపరంగా అర్హత సాధించారు. ఈ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెడుతూ, మారుతున్న కాలానికి , రాష్ట్ర అభివృద్ధి పరిణామాలకు అనుగుణంగా జనాభా పెరుగుదల రేటును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలోనే ఈ నిబంధన తొలగింపును రాజకీయ పక్షాలతో పాటు సాధారణ ప్రజలు కూడా స్వాగతించారని ఆమె గుర్తు చేశారు. గతంలో ఈ నిబంధనపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేశారు.



కొడగాని మోహన్‌రావు
-ఎడిటర్
99633 34550

# కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను

- కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడారన్న ముఖ్యమంత్రి
- ఆయన చెప్పినందువల్లే నదీ జలాల అంశాన్ని చర్చకు పెట్టామని వెల్లడి
- రెండేళ్లుగా కేసీఆర్ సభకు రాకపోవడం విచారకరమని వ్యాఖ్య

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నదీ జలాల గురించి మాట్లాడితే, ఆయన సభకు వచ్చి రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు ఇస్తారని భావించానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నదీ జలాలపై కేసీఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టామని, కానీ ఆయన మాత్రం సభకు రాలేదని అన్నారు. శాసనసభలో 'నీళ్లునిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. కృష్ణా నది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అందుకే అనుభవం కలిగిన నాయకుడిగా కేసీఆర్ సభకు వచ్చి సలహాలు, సూచనలు చేస్తారని భావించానని అన్నారు. బయట సభల్లో, కార్యాలయాల్లో మాట్లాడే మాటల కంటే అసెంబ్లీలో మాట్లాడే మాటలకు విలువ ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అవమానించినా కాంగ్రెస్ నేతలు సభకు

మిగతా 6లో..



# రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి

- జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

బెస్ట్ వాయిస్,ఇల్లంతకుంట:



రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండడంతో పాటు జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు.ద్విచక్ర వాహనాలను నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కార్ల వాహన దారులు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,రాంగ్ రూట్ లో వెళ్లకూడదన్నారు. జీవితం అమూల్యమైనదని అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయిన వారు అనేకమంది ఉన్నారని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని. 18 సంవత్సరాలు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన అనంతరమే తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వాలన్నారు. అధిక వేగం ప్రాణాల మీదికి తెస్తుందని. ఇంట్లో తమకోసం ఎదురు చూసేవారు ఉన్నారని వాహనదారులు గుర్తుంచుకోవాలన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పాఠశాల స్థాయిలోనే వాహనాలు నడుపుతున్న విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ పాఠశాల నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, సర్పంచ్ మామిడి రాజు, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, మోటార్ వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, మోటార్ వాహనాల సహాయ తనిఖీ అధికారులు రజిని, పృథ్వీరాజ్ వర్మల తో పాటు జిల్లా పరిషత్ పాఠశాల, వాణి నికేతన్, వివేకానంద పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్వేరోస్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. సర్పంచ్ చీదురు శంకర్, ఎంఈఓ బిక్షపతి, హెడ్మాస్టర్ నవీన్, సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.





# కొండగట్టుకు తరలి వెళ్లిన జనసేన సైనికులు

బెస్ట్ వాయిస్,కమలాపూర్:

కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం నుండి జనసేన పార్టీ నాయకులు కొండగట్టుకు తరలి వెళ్లారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ 35 కోట్ల పంతొమ్మిది లక్షల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన గాజులు హనుమాన్ మాలవిరమణ మండపం కోసం నేడు భూమి పూజ చేయడానికి పవన్ కళ్యాణ్ రావడంతో ఆయనను కలిసేందుకు జనసేన పార్టీ నాయకులు జిల్లాల మహేష్, ఇంగే శ్రీనివాస్, కుసుంబ శివాజీ,పుల్ల సాయి కుమార్, కుసుంబ సాంబశివ రావు, కాసూరి కృష్ణ,కాసూరి సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన పార్టీ తరఫున మర్రిపల్లిగూడెం గ్రామ సర్పంచిగా పోటీ చేసిన కాసూరి మమతతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ఫోటో దిగారు.



# రైతులకు కొరత లేదు

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

మండలంలోని పెద్దతండ గ్రామపంచాయతీ పరిధిలో రైతులకు యూరియా పంపిణీ సజావుగా కొనసాగుతోంది. మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ కూమార్ రైతులకు సకాలంలో టోకెన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు అపోహలకు లోనుకాకుండా పట్టా పాసుబుక్ ద్వారా మొబైల్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అధికారులు స్వయంగా గ్రామాలకు వెళ్లి టోకెన్లు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సుశీల వీరన్నతో పాటు ఏఈఓ చందులాల్, శ్రావణ్, పంచాయతీ సెక్రెటరీ సురేష్, వర్ధన్నపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ భూక్య విజేందర్ నాయక్,బూత్ కన్వీనర్ భూక్య మోహన్, వార్డుమెంబర్లు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులే ఆరోగ్యకరం

బెస్ట్ వాయిస్,హనుమకొండ:



భారతదేశం గో ఆధారిత, సేంద్రియ వ్యవసాయానికి పెట్టింది పేరని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. నేటి ఆధునిక యుగంలోనూ కొందరు రైతులు సేంద్రియ,సహజ వ్యవసాయ పద్ధతులను కొనసాగిస్తూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.హనుమకొండ పబ్లిక్ గార్డెన్లో ఏర్పాటు చేసిన న్యాచురల్ మరియు ఆర్గానిక్ రైతుల సంత రెండవ రోజు ప్రారంభ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి సందర్శించారు.ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను పరిశీలించి రైతులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. సేంద్రియ ఉత్పత్తుల తయారీ విధానాలు, మార్కెటింగ్ విధానం, వినియోగదారుల స్పందన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఓల్డ్ ఇస్ గోల్డ్ అన్న నానుడి వ్యవసాయ రంగానికి పూర్తిగా వర్తిస్తుందని రానున్న రోజుల్లో ప్రజలంతా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రియ, సహజ ఉత్పత్తులు చిరుధాన్యాల వైపే మొగ్గు చూపుతారు అని అన్నారు. మిల్లెట్స్‌తో తయారు చేసిన కిచిడిని రుచి చూసిన ఏసీపీ, చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉన్నాయని తెలిపారు.చిన్ననాటి నుంచే పిల్లలకు ఇలాంటి ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవర్చాల్సిన అవసరం ఉందని మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ పాఠశాలలలో చిన్నారులకు చిరుధాన్యాలతో చిరుతిళ్లు అనే కార్యక్రమం అభినందినేయమని అన్నారు.సంత నిర్వాహకులు భయ్య సారయ్య,నిమ్మల శ్రీనివాస్ తదితరులను ఏసీపీ అభినందించారు.స్టాల్ యజమానులు ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య దంపతులు, సంతోష్, కృష్ణ ప్రసాద్, సంగీత్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. న్యాచురల్ మరియు ఆర్గానిక్ సంత ఈ రోజు కూడా కొనసాగుతుందని మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం పబ్లిక్ గార్డెన్ వాకర్స్‌కు చిరుధాన్యాలతో తయారు చేసిన జావను ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

బెస్ట్ వాయిస్,ఇల్లంతకుంట:

మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైస్కూల్ లో స్థానిక సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య,ఉప సర్పంచ్ ఎలావేని రమేష్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, స్త్రీ విద్యకు పునాదులు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని, అలాగే జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్నిస్మరించుకుంటువిద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమనిఅన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అన్ని కుల సంఘాల అధ్యక్షులు, హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు,ప్రజా ప్రతినిధులు,నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన బోయినపల్లి సంపత్ రావు దశదిన కర్మ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు,యం. మనోజ్, మాజీ సొసైటీ చైర్మన్ గంధం బాలరాజు,గ్రామ పార్టీ అధ్యక్షులు మసాని వెంకట్, యూత్ నాయకులు రాపాక రాజశేఖర్ తదితర మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# టీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:

టీ పిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్,మంత్రి సీతక్క ను నూతన శనివారం అంబర్ పేట కు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం,కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీకాంత్ నేత, తదితరులు పాల్గొన్నారు.



# పంట వదిలి యూరియా బాట పట్టిన రైతన్న

బెస్ట్ వాయిస్,ఆత్మకూర్:

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్లో ఏ విధంగా అయితే యూరియా కోసం ఇబ్బందులు పడ్డారో తిరిగి రబీ లో కూడా అవే బాధలు ఎదురవుతున్నాయి. ఆత్మకూరు మండలంలోని పెంచికలపేట పిఎసిఎస్ ఎదుట యూరియా, కోసం రైతులు ఉదయం నాలుగు గంటల నుంచి పడిగాపులు కాశారు. అయితే ఎకరానికి ఒక యూరియా బస్తా ఇవ్వడంతో రైతులు నాన ఇబ్బందులకు గురవుతున్నారు. పంటకు అదునుకు యూరియా వేయకపోతే పంట దిగుబడి రాక పంట నష్టపోయి,అప్పుల పాలు అయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారు ఎకరాలు ఉన్న రైతులు యూరియా అందక వారం రోజుల నుంచి గోదాం వద్దనే పడిగాడ్పులు కాస్తున్నారు. ముందుగా నాట్లు వేసి యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు కొందరైతే ఆలస్యంగా నార్లు పోసిన రైతులు దుక్కులు దున్ని నాట్లు వేసేందుకు కూలీలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. యూరియా దిగుమతి రావడంతో ఆయా పనులను పక్కకు పెట్టి యూరియా కోసం సొసైటీ కార్యాలయం ముందు గంటల తరబడి క్యూలో నిలబడవలసి వస్తుంది రైతులకు సక్రమంగా పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందని రైతుల ప్రశ్నిస్తున్నారు. పైగా రైతులు దోమ్మి చేస్తున్నట్టుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి,పంపిణీ చేయడమేంటని రైతులు అధికారులపై మండిపడుతున్నారు. ఆన్లైన్ యాప్ ద్వారా బుక్ చేయించి రైతులకు యూరియా పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు మరల పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేస్తున్నారు. యూరియా పంపిణీ వ్యవహారంలో సంబంధిత అధికారులు రైతులకు సమాచారం ఇవ్వడంలో విఫలమవుతున్నారని వ్యవసాయ శాఖ అధికారులపై రైతులు తీవ్ర అగ్రం వ్యక్తం చేస్తున్నారు.





# ఆరె సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

- ఆరె కుల సర్పంచుల ఘన సన్మానం

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

హనుమకొండ బాలసముద్రంలోని ఆరె సంఘ భవనంలో శనివారం ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరణ మరియు ఆరె కుల సర్పంచుల సన్మాన సభ ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు కొల్లూరి కందేరావు అధ్యక్షతన జరిగింది. ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎంతో శ్రమ కోర్చి హనుమకొండ జిల్లా కమిటీ 2026 క్యాలెండర్ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. క్యాలెండర్ అనేది ఆరె కుల ఐక్యతకు దండలో దారం లాంటిదని వ్యాఖ్యానించారు. 14 మంది ఆరె కుల సర్పంచులు ఎన్నికవడం గర్వకారణమని,ఈ విజయం గ్రామ స్థాయితో ఆగకుండా చట్టసభల వరకు కొనసాగాలని ఆకాంక్షించారు. సాధారణ ప్రజల గుండెల్లో ధైర్యం నింపిన మహానేత,గ్రామ పాలనకు ప్రాధాన్యం ఇచ్చిన ఛత్రపతి శివాజీ మహారాజు స్పూర్తితో ఆరె కుల సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపెల్లి శివాజీ మాట్లాడుతూ, హనుమకొండ జిల్లా కమిటీ సంఘ కార్యక్రమాల్లో అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆరె కుల సర్పంచులకు భవానీ మాత ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు.ఆరె కులం విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు సాగాలంటే శివాజీ మహారాజ్ చూపిన ధైర్యం, క్రమశిక్షణ, ఐక్యతను అనుసరించాలని వక్తలు సూచించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు ముందుండాలని, గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాల ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెండా రాజేష్, మోర్తాల చందర్ రావు,బలేరావు మనోహర్ రావు, కుడ్ల మనోహర రావు, లాండిగే లక్ష్మణరావు, వలిగే సాంబరావు, హింగే శివాజీ, దుమాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.జిల్లా గౌరవ అధ్యక్షులు వాడికారి బాబురావు,ప్రధాన కార్యదర్శి వజ్ర కిషన్ రావు జిల్లా నాయకులు పేర్వాల లింగమూర్తి, లోనె దీపక్ జి, నాగుర్ల సంతోష్, కిషన్ రావు, సుధాకర్ రావు హింగే భాస్కర్,శ్రీనివాస్ వివిధ మండలాల అధ్యక్షులు, కులబంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఘనంగా సావిత్రి బాయి ఫూలే 195 వ జయంతి వేడుకలు

బెస్ట్ వాయిస్,ఆత్మకూర్:




ఆత్మకూరు మండలంలోని నీరుకుల్ల గ్రామంలో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కమిటీ అధ్యక్షులు పిట్టల రాజమౌళి అధ్యక్షతన ఘనంగా సావిత్రిబాయి పూలే 195 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సోషల్ సైంటిస్ట్ మేడ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా గ్రామ పాలక మండలి మహిళలతో స్త్రీలను గౌరవించుకుందాం, స్త్రీలను కాపాడుకుందాం, స్త్రీలను చదివించుకుందాం,అని ప్రతిజ్ఞ చేయించి,ఈ దేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రతీ ఒక్కరు వారి మార్గంలో నడవాలి అంటే అందరూ చదువుకోవాలి అని అప్పుడే స్త్రీల పరిస్థితులు మెరుగుపడుతాయని పిలుపునిచ్చారు.అందరికి సమాన అవకాశాలు కల్గినపుడే సావిత్రిబాయి కలలు కన్న సమాజం సాకారం అవుతుందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోజు మేము చదువుకొని ఈ పదవులు చేపట్టినము,అంటే కేవలం సావిత్రిబాయి వల్లనే అని చెప్పారు,పెంచికలపేట సర్పంచి మందపెల్లి మరియా ప్రసాద్ మాట్లాడుతూ మనకు చదువు నేర్పిన గురువును ఎలా మరచిబోమో మన చదువుల తల్లిని కూడా మరవకూడదని అన్నారు. కేశవాపురం సర్పంచ్ రమ రమేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గారి జయంతిలో పాల్గొనడం మాకు గర్వకారణంగా ఉన్నదని చెప్పారు. జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మలా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతి రోజును మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. మహిళలు మరియు విద్యార్థుల చేత కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీరుకుల్ల పంచాయతీ కార్యదర్శి జితేందర్ రెడ్డి, నీరుకుల్ల గ్రామ ఉప సర్పంచి కిన్నెర ప్రేమ్చంద్ , వార్డు సభ్యులు, మాజీ సర్పంచి అర్శం బలరాం, పెంచికలపేట మాజీ ఎంపీటిసీ మందపెల్లి మమత రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, నీలం రాజు, పొనుగోటి సత్యం, న్యాతని ప్రవీణ్, అర్శం కుమార్,సూరం రాధ, మహిళా సంఘాల నాయకులు,అంగన్వాడి టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శివనగర్ మీసేవ కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు

బెస్ట్ వాయిస్,వరంగల్:

వరంగల్ ఫోర్ట్ రోడ్డు రుద్రమ్మనగర్ లోఉన్న ఖిలా వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయాన్ని శివనగర్ లోని మున్సిపల్ మీ సేవకేంద్రం పై అంతస్తులోకి మార్చుతున్నట్లు తహశీల్దార్ ఎండీ ఇక్బాల్ తెలిపారు.కార్యాలయం మార్పునకు సంబంధించిన పనులను శనివారం ఆయన పరిశీలించారు. సోమవారం నుంచి పూర్తి స్థాయి సేవలు ఇక్కడి నుంచే అందిస్తామన్నారు. ఖిలావరంగల్ మండల ప్రజలు రైతులు కార్యాలయ మార్పునకు సహకరించాలని వారు కోరారు.







# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా విద్యకు కృషి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

బెస్ట్ వాయిస్,వరంగల్:

సావిత్రిబాయి పూలే 159 వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితోనే భారత రాజ్యాంగంలో విద్యా హక్కు చట్టం, సమానత్వ చట్టాలు పొందుపరచడం జరిగిందని అన్నారు. ప్రత్యేకించి మహిళా విద్య కోసం ఆమె చేసిన కృషిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు మహిళ విద్యకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. మహిళలు మానసికంగా, భావోద్వేగపరంగా ఎంతో బలమైనవారని అన్నారు. నేటి పురుషులు మహిళలకు సహకరిస్తుండటం అభినందనీయమని అన్నారు. మైత్రి, గార్గి వంటి మహనీయ మహిళలను అందించిన దేశం భారతదేశమని చెప్పారు. అదే కోవకు చెందిన మహిళామూర్తి సావిత్రిబాయి పూలే అని, జ్ఞానం కలిగిన మహిళతోనే గొప్ప సమాజం నిర్మితమవుతుందని స్పష్టం చేశారు. వివక్ష, అణిచివేత ఉన్న కాలంలో మహిళా విద్య ద్వారా చైతన్యం నింపిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని తెలిపారు. నేటి మహిళలు సాంకేతికతను అత్యుత్తమంగా వినియోగించుకోవాలని సూచించారు. అడ్డంకులను అధిగమించినప్పుడే విజయం సాధ్యమని, లోపాలను సరిదిద్దుకుంటూ క్షమాగుణంతో ముందుకు సాగాలని అన్నారు. బాలిక విద్య వల్ల సమాజంలో గణనీయమైన మార్పులు వచ్చాయని, విద్యార్థుల్లో ప్రేరణ కోసం 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని అమలు చెస్తున్నట్లు తెలిపారు.విద్యా బోధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలోని మహిళా ఉపాధ్యాయినులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 32వ డివిజన్లో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

బెస్ట్ వాయిస్,వరంగల్:

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని శనివారం రోజున 32 వ డివిజన్ లో గల ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఎస్ ఆర్ ఆర్ తోట , స్కూల్ నందు జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు కవిత సభాదక్షతన వహించారు సమావేశంనకు ముఖ్య అతిథిగా 32 వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి హాజరై పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా శాలువాలతో సత్కరించారు, అనంతరం పల్లం పద్మ రవి మాట్లాడుతూ శతాబ్దం కిందట మహిళలకు విద్య అందని ద్రాక్ష గా ఉన్న విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకొని రావటానికి ఎన్నో సంవత్సరాలు అహర్నిశలు కష్టపడింది అని ఆ కష్టం ఫలితంగా నేడు మహిళలు నేడు ఎందరో మహిళలు మంచి ఉన్నత పదవులలో ఉన్నారు.అందుకు కారణం సావిత్రి భాయి పూలే అని కొని ఆడటం జరిగింది . తదనంతరం ప్రధానోపాధ్యాయులు టి కవిత మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, ఆమె ఎన్నో ఉద్యమాలు చేసి స్త్రీల పట్ల స్త్రీలను పురుషాధిక్యత ఉన్న సమాజంలో ఎన్నో కష్టాలకు గురి చేస్తే వాటి అన్నింటిని ఎదుర్కొని వారి గూర్చి ముందు నడచిన వీర వనిత అని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# నాకు పునర్జన్మనిచ్చింది కొండగట్టు అంజన్న

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

బెస్ట్ వాయిస్, జగిత్యాల:



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం ఉదయం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ. 35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో భక్తుల వసతి కోసం 96గదుల ధర్మశాల,దీక్ష విరమణ మండప నిర్మాణానికి పవన్ కల్యాణ్ భూమి పూజ చేశారు.పవన్ కల్యాణ్ తోపాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు ఉన్నారు .ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కొండగట్టు అంజన్న అంటే నాకు సెంటిమెంట్ అని,అంజన్న ఆశీస్సులతోనే ప్రమాదం నుంచి బయటపడ్డ కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చిందని,గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోందని,కొండగట్టు అభివృద్ధికి నా వంతు సాయం చేస్తానని,గతంలో దర్శనానికి వచ్చిన ప్పుడు దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని,తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని,అంజన్న ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని,గిరి ప్రదక్షిణ అంశాన్ని నా దృష్టికి తెచ్చారని,కొండగట్టు గిరి ప్రదక్షిణకు సహాయం చేస్తామని పవన్ చెప్పారు.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.రేవంత్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని, ఆంజన్న ఆశీస్సులు ఆయనకు ఉండాలని పవన్ పేర్కొన్నారు.



# నట్టల నివారణ మందుల పంపిణీ

బెస్ట్ వాయిస్,ఇల్లంతకుంట (సిరిసిల్ల):

ఇల్లంతకుంట మండలం వల్లంపట్లగ్రామంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నేరెళ్ల విజయ్ మాట్లాడుతూనట్టల నివారణ మందుల వల్ల మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి పూర్ణ చంద్రిక, గోపాల మిత్ర సభ్యులు రమేష్, వివి లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యా బలోపేతానికి సర్పంచ్‌ల సహకారం అవసరం



- ప్రిన్సిపాల్ దేవరాజం
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన సర్పంచ్‌లతో సమావేశం

బెస్ట్ వాయిస్,ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట ఇంటర్ విద్య బలోపేతానికి సర్పంచుల సహకారం అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం అన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోశనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని వివిధ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవరాజం మాట్లాడుతూ కళాశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చేపడుతున్న ప్రత్యేక ప్రణాళికలను వివరించారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థుల హాజరు పెంపు, డ్రాప్‌అవుట్ విద్యార్థుల సంఖ్య తగ్గించడం, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలపై కళాశాల యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను సర్పంచ్‌ల దృష్టికితీసుకువచ్చారు.సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు చేపడుతున్న కృషిని అభినందించారు. విద్యార్థులను కళాశాలకు నియమితంగాహాజరయ్యేలాప్రోత్సహించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నూతనంగా ఎంపికైన వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ పిల్లలకు యూనిఫామ్ పంపిణి

బెస్ట్ వాయిస్,ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ 2 ను సర్పంచ్ అరుకాల నవీన్ కుమార్, ఉప సర్పంచ్ తిప్పర వేణి బాలకిషన్ శనివారం సందర్శించి పిల్లలకు యూనియన్ ఫామ్ పంపిణీ చేసి ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చాంద్బీ, ఆయా అనిత వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మార్వో ఇక్బాల్

బెస్ట్ వాయిస్,వరంగల్:



వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మామునూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ ని మండల ఎమ్మార్వో మహమ్మద్ ఇక్బాల్ ఆకస్మిక తనిఖీ చేశారు.వారితో కలిసి భోజనం చేసాడు.అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తనకి నేరుగా తెలియజేయాలని విద్యార్థులకు తెలిపారు.హాస్టల్ వార్డెన్ తో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు.వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఎమ్మార్వో ఈ సందర్భంగా తెలిపారు.



# హాస్టల్ లో ఆకస్మిక తనిఖీ

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

మండల ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ శనివారం తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని పరిశీలించి, భోజన నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. భోజనం పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్ రికార్డులు, సానిటేషన్ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.



# సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన రాజమౌళి

బెస్ట్ వాయిస్,వరంగల్:

సామాజిక విప్లవోద్యమ నేత సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి పూలమాల వేయడం జరిగింది.మహాత్మ జ్యోతిరావు పూలే తన సహచరురాలిని సావిత్రిబాయి పూలే కు విద్య నేర్పించి అందరికీ విద్య బోధించాలని మహిళా చైతన్యమే జన చైతన్యమని వితంతువులకు మహిళలకు దళితులకు బహుజనులకు శుద్ర అతిశూద్రుల కు నాటి సమాజం నిరాకరించిన విద్యను అందించి సామాజిక విప్లవోద్యమ నేతగా సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని నేదునూరి రాజమౌళి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మాట్లాడంము జరిగింది. శనివారం రోజున కాకతీయ యూనివర్సిటీలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి 195వ జయంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి నాటి సామాజిక వ్యవస్థ సనాతన ధర్మం పేరుతో మహిళలకు శూద్రులకు అతిశూద్రులకు విద్య ఉద్యోగం నిరాకరించడాన్ని సావిత్రిబాయి పూలే ధైర్యంగా ఎదుర్కొని అందరికీ విద్యను అందించిన దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలని తెలిపారు. ఈ క్రమంలో దొమ్మాటి ప్రవీణ్ కుమార్ భారత్ బచావో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మూఢ విశ్వాసాలపై కుల వివక్షత పై అక్షరాయుధము తో మనువాద సమాజాన్ని చీల్చి చెండాడిన వీర వనిత అని పేర్కొన్నారు. నేటి సామాజిక రుగ్మతల పై పోరాడటమే సావిత్రిబాయి పూలే కు అర్పించే నిజమైన నివాళులు అన్నారు ఈ కార్యక్రమంలో కాసర బోయిన రవితేజ వేల్పుల ప్రభాకర్ దుస్స వెంకటశ్వర్లు నాగరాజు కుమార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# నేటి సమాజానికి సావిత్రిబాయి పూలే ఆదర్శనీయం

బెస్ట్ వాయిస్,హనుమకొండ:



మహిళలకు విద్య అందించడం కోసం ఎన్నో అవమానాలను, ఆటంకాలను ఎదుర్కొని బాలికలకు విద్యను అందించి పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయులు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి ఆదర్శనీయమని, ఆ మహనీయురాలును ఆదర్శంగా తీసుకోవాలని కేయూ పరిశోధకులు జాక్ అధ్యక్షులు డి. తిరుపతి పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే 195వ, జయంతి సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ వద్ద విద్యార్థి జేఏసీ, స్కాలర్స్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ఆధునిక భారత చరిత్రలో ధృవతార, ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమకారిణి అయిన సావిత్రి బాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, సమాజంలో మహిళల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో విద్యార్థినిలు, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, కేయూ జాక్ వైస్ చైర్మన్ కేతపాక ప్రసాద్, కన్వీనర్ కందికొండ తిరుపతి, కార్యదర్శి జనగాం రాజారాం, కోశాధికారి రేగుల నరేష్, చందు,నిడికొండ మౌనిక, పాటు నాయకులు అశోక్, సాయి, తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్త్రీ విద్యకు పునాది సావిత్రి బాయి పూలే

- **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.**

బెస్ట్ వాయిస్,వరంగల్:



సామాజిక సంస్కర్త సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా వారు సమాజం కోసం ప్రముఖంగా మహిళల కోసం, బహుజనుల కోసం చేసిన సేవను గుర్తుచేసుకుంటూ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ నగరం గిర్మాజీపేటలో ఆ మహానుభావురాలికి ఘనంగా నివాళులర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే భారతదేశ విద్యా చరిత్రలో ఒక ధ్రువతార, అణగారిన వర్గాల ఆశాదీపమని, ఆమె కేవలం ఒక మహిళా ఉపాధ్యాయురాలు మాత్రమే కాదు, సమాజంలోని మూఢనమ్మకాలను ఎదిరించిన గొప్ప విప్లవకారిణి. అదేవిధంగా ఆ రోజుల్లో మహిళలు చదువుకోవడం పాపంగా భావించేవారు.ఆమె పాఠశాలకు వెళ్తుంటే కొందరు వ్యక్తులు ఆమెపై రాళ్లు, పేడ విసిరేవారు. అయినా సరే, ఆమె వెనకడుగు వేయకుండా మరో చీరను వెంట తీసుకువెళ్లి, ధైర్యంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించారు. వితంతువుల కోసం ఆశ్రమాలు కల్పించడం, అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. నేడు మనం అనుభవిస్తున్న ఈ విద్యా స్వేచ్ఛ సావిత్రిబాయి పూలే వేసిన భిక్ష. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, బిజెపి జిల్లా నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్తా, సిద్ధోజు శ్రీనివాస్, ఎల్లబోయిన చంద్ర మోహన్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, మండల నాయకులు మామిడాల సతీష్, అక్కినే సాగర్, సాంబరాజు కమలాకర్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

బెస్ట్ వాయిస్,దేవరూప్పుల:



జనగామ జిల్లా దేవరూప్పుల మండలం ధన బండ ఎంపీపీఎస్ పాఠశాల లో శనివారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ" మహిళలు చైతన్యవంతం కావాలంటే చదువు ఒక్కటే ఆయుధమని ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సావిత్రిబాయి పూలే వేషధారణంతో విద్యార్థిని అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పైళ్ళ వినయ్ కుమార్ రెడ్డి పుట్టినరోజున 100మందికి అన్నదానం

బెస్ట్ వాయిస్,నార్కెట్ పల్లి:



నార్కెట్ పల్లి,నైబాయ్ వాస్తవ్యులు పైళ్ళ సుజాత కుమారుడు పైళ్ళ వినయ్ కుమార్ రెడ్డి పుట్టినరోజున సందర్భంగా నిరుపేదలకు నిస్సహాయులకు బాటసారులకు బిక్షాటన చేసేవారికి 100మందికి అన్నదానం చేయడం జరిగింది. వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ప్రతి ముఖ్యకర్యం లో నిరుపేలకూ మనం స్వచ్చంద సంస్థ ద్వారా నిజమైన అర్హులైన పేదల ఆకలి తీర్చటం జరుగుతుంది, నా పుట్టినరోజున ఇంతమంది ఆకలికీ మేలు చేయటం లక్షలు సంపాదించన ఈ సంతోషం దొరకదు. నా పుట్టినరోజు పేరుమీద నిరుపేదల ఆకలి తీర్చాలి అనుకున్నాం.మరియు వటిమర్తి సాయిబాబా గుడి దగ్గర ప్రత్యేక పూజలు జరిపించాం,ఈ కార్యక్రమంలో తమ్ముడు పైళ్ళ రాజేందర్ రెడ్డి,సునిల్ రెడ్డి,అమరేందర్ రెడ్డి ,ధర్మేంద్ర రెడ్డి,స్నేహితుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు దృష్టికి తీసుకెళ్లినా అనిల్ కుమార్



బెస్ట్ వాయిస్, మహబూబాబాద్,

మహబూబాబాద్ జిల్లాలోని పేద ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలో చెరువులు, కుంటలపై జరుగుతున్న అక్రమ కబ్జాలు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాల లేమి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ సభ్యులకు వివరించినట్లు చెప్పారు.ప్రత్యేకంగా గ్రామాల్లోని చెరువులు, కుంటలు అక్రమ కబ్జాలకు గురవడం వల్ల భవిష్యత్ తరాలకు నీటి వనరులు దక్కని పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల ప్రజల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించడంతో పాటు రానున్న కాలంలో మరిన్ని సమస్యలకు దారితీస్తాయని హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ అంశాలపై స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపినట్లు వరిపల్లి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇస్తారని భావించాను

తరువాయి భాగం

వచ్చి మాట్లాడేవారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో మాట్లాడకపోతే అంతిమంగా ప్రజలకే అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కృష్ణా జలాలపై చర్చను తెరపైకి తెచ్చిందే కేసీఆర్ అని గుర్తుచేశారు. కానీ ఆయనకు చట్టసభలంటే చిన్నచూపు అని విమర్శించారు. జలాలపై గందరగోళం వద్దు నదీ జలాల అంశంపై కేసీఆర్ ఇటీవల ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఇలాంటి కీలకమైన విషయాలను పార్టీ కార్యాలయాల్లో మాట్లాడితే ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని, అందుకే వాస్తవాలను చర్చించడానికి అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టామని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై వేర్వేరుగా చర్చించి, ఒక స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా జలాలపై వాస్తవాలను సభ ముందు ఉంచారని రేవంత్ రెడ్డి వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, ఆ తర్వాత జరిగిన బీఆర్ఎస్ పాలనలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు నీటి కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డగా ఈ అన్యాయాన్ని సరిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ గారు ఇప్పటికైనా సభకు వచ్చి రాష్ట్రానికి సలహాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు.



# పాలమూరుని రాజకీయాల కోసం కేసీఆర్, రేవంత్ వాడుకుంటున్నారు..

- **మా జిల్లాకు నీళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి కేసీఆర్, రేవంత్ రెడ్డికి లేదు..**
- **రివ్యూలకు నన్ను పిలవడం లేదు.. కలిసి నిర్ణయం తీసుకుంటే ఇబ్బంది ఏంటి?: డీకే అరుణ**

బెస్ట్‌వాయిస్, స్టేట్ బ్యూరో:

పాలమూరు జిల్లాను కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ విమర్శించింది. పాలమూరు ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఇద్దరికీ లేదు.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లతో ఒకరిపై ఒకరు నేపం నెట్టుకునే ప్రయత్నం తప్ప ఏం లేదు.. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ఇద్దరు పాలమూరు ప్రజలకు నష్టం చేసిన వారేనని మండిపడింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలని ఉన్న మొదటి DPR ప్రకారం తీసుకోవాలని అనేక సార్లు చెప్పడం జరిగింది.. పాలమూరు రైతులతో ఆట ఆడుతున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించింది.ఇక, మాయ మాటలతో, మోసం చేసి.. మరోసారి అధికారంలోకి రావాలని కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పులను వాళ్ళపై నెట్టి తప్పించుకోవాలని కాంగ్రెస్ నాటకం ఆడుతుంది. ఇద్దరు ఆడుతున్న నాటకంలో పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.. పాలమూరు ప్రజలను పదేళ్లు కేసీఆర్ మోసం చేశారనే.. ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారు.. జూరాల అప్రోచ్ అయితేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పుకొచ్చింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడానికి ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదు.. డిండి ప్రాజెక్టుకి నీళ్ళు తీసుకెళ్లడంతో పాలమూరు ప్రజలకు అన్యాయం జరుగుతుందని బీజేపీ ఎంపీ అరుణ తెలిపింది. అయితే, పోటీలు పడి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు.. దాని ఔట్ కమ్ ఏంటి? అని డీకే అరుణ ప్రశ్నించింది. డిండి ప్రాజెక్టుకి నీళ్ళు తీసుకెళ్ళడాన్ని గతంలో పార్టీలకు అతీతంగా వ్యతిరేకించడం జరిగింది.. జూరాల నీళ్లు తీసుకుని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ DPR టెకాప్ చేయండి అని సూచించింది. ఇంతకు ముందు చేసిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కల్వకుర్తిలో కలపండి లేదా నాగర్ కర్నూల్, నల్గొండ అని దాని పేరు పెట్టండి అని కోరింది. అందులో పాలమూరు రంగారెడ్డి రెండు లేవు.. పాలమూరు ప్రాంత ఎమ్మెల్యేలు ఎందుకు నోర్లకు ప్లాస్టర్ వేసుకున్నారని అడిగింది. డిండికి నీళ్ళు తీసుకెళ్తుంటే నోర్లు మూసుకొని, చోద్యం చూస్తున్నారంటూ మండిపడింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పై ఎందుకు రివ్యూలు పెట్టడం లేదని డీకే అరుణ క్వశ్చన్ చేసింది.అలాగే, రివ్యూలకు నన్ను ఆహ్వానించడం లేదు.. కలిసి నిర్ణయం తీసుకుంటే ఏం ఇబ్బంది వచ్చిందని? ఎంపీ అరుణ అడిగింది. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పైనా ఇరిగేషన్ నిపుణులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో రివ్యూ పెట్టండి అని సూచించింది. వచ్చే మూడేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేలా సీఎం చొరవ తీసుకోవాలని కోరింది.





## శబరిమలై కు బయలుదేరిన రంగశాయిపేట అయ్యప్ప స్వాములు

బెస్ట్ వాయిస్,వరంగల్:

వరంగల్ నగరంలోని 42వ డివిజన్ లో గల శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో ఇరుముడులను కట్టినారు అనంతరం మహంకాళి దేవాలయం నుండి కారు ప్రయాణం చేస్తూ శబరిమలైకు చేరుకుంటామని చాపల నాగరాజు గురుస్వామి తెలిపారు ఈ కార్యక్రమంలో గంధ్రతి కుమార్ గురు స్వామి చాపల సుధీర్ కుమార్ ఆసం విశ్వకుమార్ బూటూజు వినయ్ సంపంగి రాకేష్ చెక్కిళ్ల రజనీకాంత్ చింత వినీత్ కుప్ప రాజు అంకాల శ్రీనివాస్ స్వాములు కుటుంబ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



## భూపాల్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రిఎర్రబెల్లి దయాకర్

బెస్ట్ వాయిస్,హాసన్ పర్తి:

హాసన్ పర్తి మండలం దేవన్నపేట మాజీ సర్పంచ్ పంజాల భూపాల్ గౌడ్ కుమారుడు పంజాల చరిత్ ఇటీవలే మరణించగా నేడు వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో జిల్లా, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## ప్రపంచ తెలుగు మహాసభలకు దేవులపల్లి రమేశ్ కు ఆహ్వానం

బెస్ట్ వాయిస్, నంగునూర్:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు గాను, సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండల కేంద్రానికి చెందిన రచయిత, కవి బీసీ గురుకుల,ఎంజేపీ తెలుగు అతిధి ఉపాధ్యాయులు దేవులపల్లి రమేశ్, ఆహ్వానం అందుకున్నారు.ఆంధ్ర సారస్వత పరిషత్తు,ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు, ఈనెల 3వ తేది నుండి 5వ తేదీలలో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల సదస్సులో పాల్గొనవలసిందిగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్,తెలుగు మహాసభల సమన్వయకర్త, పి. రామచంద్ర రాజు, కొల్లి రమావతి, ఆహ్వానం పంపారు.3వ ప్రపంచ తెలుగు మహాసభలకు అవకాశం రావడం చాలా సంతోషకరమని, తెలుగు భాష గొప్పతనం, గురించి కవితాగానం చేస్తున్నట్లు, కవి దేవులపల్లి రమేశ్ పేర్కొన్నారు. తెలుగు భాష అభివృద్ధి కొరకు కృషి చేస్తానని మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం తెలుగు వారి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,వివిధ రాష్ట్రాల మంత్రులు, వివిధ దేశాల కవులు కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

# ప్రయోగాలు ఆపని క్రేజీ స్టార్

వరుసగా క్రేజీ సినిమాల్లో నటిస్తూ పాన్ ఇండియా భాషలన్నీ చుట్టేస్తోంది క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్. 'మహానటి'తో జాతీయ పురస్కారాన్ని దక్కించుకుని తన నటనతో అందరిని ఆశ్చర్యపరిచిన కీర్త సురేష్ మిగతా స్టార్ హీరోయిన్‌లకు పూర్తి భిన్నంగా సినిమాలు చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. స్టార్ హీరోల చిత్రాల్లో నటిస్తూనే అదే సమయంలో తన రేంజ్‌కి, తన స్టార్‌డమ్‌కు మ్యాచ్ కానీ యంగ్ హీరోలతోనూ నటిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. స్టార్ హీరోయిన్‌గా కెరీర్ పీక్స్‌లో ఉన్న దశలో చిన్న సినిమాలు, హీరోయిన్ సెంట్రిక్ మూవీస్‌లలో నటిస్తోంది. కోలీవుడ్ టు బాలీవుడ్ వరకు ఐదు భాషల ఇండస్ట్రీలని చుట్టేస్తూ దక్షిణాది, ఉత్తరాది ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. లవ్ స్టోరీస్, ఫ్యామిలీ మూవీస్, యాక్షన్ డ్రామాస్, రివేంజ్ డ్రామాల్లో నటిస్తూ వెర్సటైల్ స్టార్ అనిపించుకుంటోంది. తమిళంలో `కన్నివేడి`లో నటిస్తున్న కీర్తి తెలుగులో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోల డైరెక్షన్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న యాక్షన్ డ్రామా `రౌడీ జనార్థన`లో నటిస్తోంది. పాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఇందులో నటనకు అత్యంత ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్‌లో కనిపించి సర్‌ప్రైజ్ చేయబోతోంది. రౌడీతో కలిసి కీర్తి ఫస్ట్ టైమ్ చేస్తున్న సినిమా కావడం, పీరియాడికల్ పొలిటికల్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలో విజయ్ దేవరకొండ సరికొత్త గెటప్‌లో రౌడీ జనార్ధనగా సరికొత్త పాత్రలో కనిపించనుండటంతో దీనిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ మూవీ షూటింగ్‌లో పాల్గొంటూనే కీర్తి సురేష్ మరో మలయాళ సినిమాని లైన్‌లో పెట్టేసింది. అదే `తోట్టం`. రిషి శివకుమార్ దర్శకుడు. ఆంటోనీ వర్గీస్ హీరో. ఇదొక థ్రిల్లర్. రీసెంట్‌గా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. డార్క్ ఇంటెన్స్ టోన్‌తో ఈ సినిమా యాక్షన్ థ్రిల్లర్‌గా సాగుతుందనే సంకేతాల్ని అందిస్తోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కీర్తి సురేష్ వింటేజ్ బ్రౌన్ కలర్ ఔట్‌ఫిట్ ధరించి..లేస్ ఊడిన షూస్.. చుట్టూ కమ్మేసిన పొగ.. చేతిలో పగిలి రక్తం కారుతున్న గ్లాస్..కాళ్ల చుట్టూ పగిలినబాటిల్స్, బుల్లెట్స్ కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని పెంచేస్తోంది. ఇందులో విశేషం ఏంటంటే 'అర్జున్‌రెడ్డి', కబీర్‌సింగ్', యానిమల్ మూవీస్‌కి సంగీతం అందించిన టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నాడు. కీర్తి థ్రిల్లర్ మూవీకి హర్షవర్ధన్ మ్యూజిక్ చేస్తుండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాకెట్ స్పీడుతో షూటింగ్ పూర్తి చేసి త్వరలోనే సినిమాని పాన్ ఇండియా మూవీగా మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



Printed, Published & Owned by Kowdagani Jyothi Printed at VM Printers H.No. 8-10-37, Radhika Theatre, Warangal.Telangana- 506002. Published at # 16-1-558/2 SRR Thota,Kareemabad, Warangal. Telangana -506002. Editor: Kowdagani Mohan Rao, RNI No.TELTEL/2016/68994. Cell:9963334550, email: bestvoicenews@gmail.com